# ఎవరు పిచ్చివాళ్ళు?



మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది.

పెద్ద బజారు దగ్గర చాలామంది గుమిగూడి ఉన్నారు. ప్రమాదం ఏమైనా జరిగిందా... అనుకుంటూ నేనూ ఆ జనంలో జొరబడ్డాను.

అక్కడ ఒక ఇంటి పెద్ద అరుగు మీద ఒక నడివయస్కుడు పడుకుని మూలుగుతున్నాడు. ఒకాయన అతని చొక్కా పైకెత్తి పొట్టకి నూనె రాస్తుంటే, మరొకాయన కాళ్ళు పిసుకుతున్నాడు.

ఆ పడుకుని ఉన్న వ్యక్తి ఎవరా... అని తేరపార చూస్తే- అతను ఎవరో కాదు- ఒళ్లంతా కుళ్ళు గుడ్డలు వేసుకుని జడలు కట్టుకున్న జుట్టుతో ఊరంబట తిరుగుతూ ఉండే పిచ్చివాడు.

ఆ పిచ్చివాడిని నేను ఆ ఊళ్లో ఎన్నో ఏళ్లబట్టి చూస్తూనే ఉన్నాను. ఎప్పుడూ ఏదో గొణుక్కుంటూ తనలో తాను నవ్వుకుంటూ... ఇతరులు ఉడికిస్తున్నా, రాళ్లు వేసి కవ్విస్తున్నా లెక్కచేయక తన దారిన తాను పోతుంటాడు. మంచివాళ్ళని పిచ్చివాళ్ళని చేసి చూసి ఆనందించే జనం- ఈ పిచ్చివాడికి సేవలు చేస్తుంటే ఎంతో ఆశ్చర్యం వేసింది.

"ఏం జరిగింది?" అని అన్నాను జనంలో ఒకరిని ఉద్దేశించి.

"స్వాములవారికి పొట్ట నెప్పి వచ్చింది" అన్నాడు ఆయన.

నా చెవులను నేనే నమ్మలేకపోయాను.

"స్వాములవారు ఎవరండీ? ఇతను పిచ్చివాడు కదా?" అన్నాను ఆశ్చర్యంతో.

"అపరాధం- అపరాధం! ఆయన పిచ్చివాడులా కనిపిస్తాడు కాని, మహాజ్ఞాని!" అన్నాడు ఆయన లెంపలు వేసుకుంటూ.

'ఇంకా నయం... నా లెంపలు వేశాడు కాదు!' అనుకున్నాను మనస్సులోనే.

"ఆయన పిచ్చివాడు అనుకునేవాళ్ళు పిచ్చివాళ్ళు నాయనా! లోకం జ్ఞానులని పిచ్చివాళ్ళని అనుకుంటుంది. రామకృష్ణ పరమహంస కథ వినలేదూ?" అన్నాడు ప్రక్కనున్న ఇంకొక ముసలాయన చిదానందంగా నవ్వుతూ జ్ఞానరహస్యాన్ని తెల్పుతూ.

ఇంతలో... జనాన్ని చీల్చుకుంటూ 'తల్పశాయి' అక్కడికి వచ్చాడు.

చేతిలో ఓ అల్యూమినియం క్యారియరూ, ఇంకో చేతిలో మరచెంబు పుచ్చుకుని తిన్నగా ఆ పిచ్చివాని దగ్గరకు వెళ్లాడు.

'ఇతను ఎందుకు వచ్చాడా...' అని ఆశ్చర్యపోసాగాను. నేను ఆశ్చర్యాన్నుంచి కోలుకోకముందే తల్పశాయి ఆ పిచ్చివాడిని లేపి, కూర్చోబెట్టి మరచెంబులోని నీళ్లతో చేతులు కడిగి క్యారియర్‌ను ఊడదీసి ఆ పిచ్చివానికి అన్నం కలిపి పెట్టడం మొదలెట్టాడు.

నేను మరింత ఆశ్చర్యంతో జనంలో ఇంకా ముందుకుపోయి చూడసాగాను.

తల్పశాయి నన్ను చూశాడుగాని, చూడనట్టుగా తల తిప్పుకున్నాడు.

తల్పశాయికి దేవుళ్ళూ, దెయ్యాలూ, స్వాములూ, బాబాలూ... ఇటువంటివంటే నమ్మకం లేదు. అటువంటిది- తల్పశాయి తనంతట తాను వచ్చి ఆ పిచ్చివాడిని బుజ్జగించి అన్నంపెట్టి సేవలు చేస్తున్నాడంటే నా ఆశ్చర్యానికి అవధులు లేకపోయాయి.

మరికొంచెంసేపు ఆ వింత చూసి ఆ తర్వాత నా దారి పట్టాను.

నడుస్తున్నానే కాని, నా మస్తిష్కం నిండా ఒకటే ఆలోచన- 'ఉన్నట్లుండి ఆ పిచ్చివాడు స్వామీజీ ఎట్లా అయ్యాడు? ఆయనలో ఉన్న మహత్యాన్ని మొదట గుర్తించిందెవరు?'

... ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోయాయిగాని, సమాధానం దొరకలేదు.

* * *

కొద్దిరోజులు గడిచాయి.

పిచ్చిబాబాగారి ప్రచారం అభివృద్ధి చెందింది. అతని నివాసాన్ని ఆ దగ్గర్లోనే ఉన్న పాడుబడ్డ గంగానమ్మ గుడిలోకి మార్చారు. ఏ సమయంలో చూసినా అక్కడ భక్తులు ఉంటూనే ఉండసాగారు. పళ్లు ఇచ్చేవారు కొందరు; పటిక బెల్లం పెట్టేవాళ్ళు మరికొందరు; ఫలహారాలు, నైవేద్యం పెట్టేవాళ్ళు ఇంకొందరు! వీటికితోడు- యథాశక్తి డబ్బుని అతని పాదాల దగ్గర దక్షిణంగా ఉంచేవారు మరికొందరు. ఈ విధంగా రంగరంగ వైభవంగా ఉండసాగింది ఆ గంగానమ్మ గుడి!

నాకు తరచూ ఆ పిచ్చివాని దగ్గర తల్పశాయే కనిపిస్తుండేవాడు. అతను లేకపోతే అతని భార్యో, పిల్లలో ఉంటుండేవారు. తల్పశాయే కాకుండా అతని కుటుంబం యావత్తూ పిచ్చిబాబా భక్తబృందంలో చేరిపోవడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

కొన్నిసార్లు ఈ పిచ్చిబాబా చేసే మహత్యాలేమిటో చూడాలని పనిగట్టుకొని ఎక్కువసేపు శ్రద్ధగా గమనించాను. అయితే... అతను నేనుండగా ఏ విధమైన మహత్యాన్నీ చేసి చూపించలేదు. భక్తులు వచ్చి తోచిన కానుకలు తెచ్చి ఏవేవో ప్రశ్నలు అడుగుతుండేవారు. వాటికి అతను ప్రత్యేకించి ఏ సమాధానమూ చెప్పేవాడు కాదు. తనలో తానే ఏదో గొణుక్కుంటూండేవాడు. మధ్యమధ్య తలని అడ్డంగానో, నిలువుగానో ఆడించేవాడు. లేదా చేతులని అటో ఇటో ఆడించేవాడు.

బాబా తల నిలువుగా తిప్పితే- తమ కార్యం ఫలిస్తుందనీ, అడ్డంగా తిప్పితే- ఫలించదనీ... ఈ విధంగా అతని భంగిమలకు భక్తులు వారంతటవారే అర్థాలు చెప్పుకుని వెళ్లేవారు. లేకుంటే ఏ తల్పశాయో, ఇంకెవ్వరైనా పెద్ద మనిషో అర్థం విశదీకరించి చెప్పేవారు.

'పిచ్చివాని చేతిరాయి' అంటే ఇదే కాబోలు- అని అనిపించింది నాకు.

ఇంతకీ... పిచ్చిబాబాకీ, తల్పశాయికీ గల సంబంధ- బాంధవ్యాలేమిటో నాకు అర్థంకాలేదు. తల్పశాయినే అడుగుదామనిపించేది. కాని, అతను సాధారణంగా ఒంటరిగా కనిపించేవాడు కాదు. ఎప్పుడైనా అరుదుగా ఒంటరిగా కనిపిస్తే, అడిగితే బాగుండదేమోనని మొహమాటపడి అడిగేవాడిని కాదు.

* * *

మరికొన్ని నెలలు గడిచిపోయాయి.

సర్వసాధారణంగా కాలం అనుకూలంగా ఉండే నాకు- అనుకోని కొన్ని చిక్కులు కలిగాయి. ఊరినుంచి బదిలీ అయ్యే ప్రమాదం ఏర్పడింది. శ్రీమతికి చికాకు పెట్టే వ్యాధి కలిగింది. ఇటువంటి చిక్కులతో మనస్సంతా అల్లకల్లోలం కాసాగింది.

నదిలో కొట్టుకుపోతున్నవాడికి చిన్న గడ్డిపరక కనిపించినా పట్టుకుంటాడు. అట్లాగే చిక్కుల చీకాకు ఎక్కువయ్యేసరికి- పోనీ... ఈ పిచ్చిబాబాని ప్రశ్న అడిగితే బాగుంటుందేమో ననిపించింది. నాకు స్వతహాగా బాబాల మీద నమ్మకం లేదు. కాని, 'తల్పశాయిలాంటి వాడే భక్తుడుగా మారినప్పుడు- నేను కేవలం ప్రశ్న అడగడంలో తప్పేముంది?' అనిపించింది. నా కళ్ల ముందు ఎంతోమంది ప్రశ్నలు అడిగి వెళ్తుండడం చూశాను. అయితే... అందరిలాగా కాకుండా తల్పశాయి ద్వారా వెళ్లి అతను ఏకాంతంలో ఉండగా సంప్రదిస్తే బాగుంటుందనుకున్నాను.

ఆరోజు ఆదివారం.

ప్రొద్దున్నే తెలతెలవారుతుండగానే నేను తల్పశాయి ఇంటికి వెళ్లాను. ఎప్పుడూ లేనిది- నేను వాళ్ళింటికి వెళ్లడంతో, అందులోనూ... అంత ప్రొద్దున్నే వెళ్లడంతో అతను ఆశ్చర్యపోయాడు.

ఆ మాటా- ఈ మాటా అయి అతను ఇచ్చిన కాఫీ త్రాగాక నా మనస్సులోని విషయం బయటపెట్టాను.

అంతా విని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ "అయితే... నువ్వు కూడా భక్తబృందంలో చేరదలచావన్నమాట!" అన్నాడు తల్పశాయి.

"నీలాంటివాడే అవగాలేంది- నేను అవడంలో తప్పేముంది?" అన్నాను.

"ఊ... నన్ను చూసే ఈ నిర్ణయానికి వచ్చావన్నమాట! అదిసరే... ఇంతకీ ఆ పిచ్చివాడెవరో తెలుసా?" అని అడిగాడు తల్పశాయి.

"తెలియదు. ఊళ్లో పిచ్చిగా తిరగడం మాత్రం తెలుసు" అన్నాను.

అంతవరకూ నవ్వుతూ మాట్లాడుతున్న తల్పశాయి ముఖం గంభీరంగా మారింది. అతని ముఖంలో విచారం ద్యోతకమైంది. "మనం ఎదురుగుండా ఉన్న గుళ్లోకి వెళ్లి మాట్లాడుకుందాం... రా!" అంటూ లేచాడు.

మౌనంగా అతన్ని అనుసరించాను నేను.

ఇద్దరం వెళ్లి గుళ్లో మంటపం మీద కూర్చున్నాం. అక్కడ చాలా ప్రశాంతంగా ఉంది. వచ్చే భక్తులు కూడా చాలా తక్కువగా ఉన్నారు.

ఒక్క నిమిషం మౌనంగా కూర్చున్నాడు తల్పశాయి. శూన్యంలోకి చూస్తూ తర్వాత దీర్ఘంగా నిట్టూర్చి- "ఆ పిచ్చివాడు నా స్వంత అన్నగారు!" అన్నాడు నెమ్మదిగా.

నా నెత్తిమీద మబ్బులేని పిడుగు పడినట్లయింది.

"ఏమిటీ- అతను మీ అన్నగారా? నాకు ఇంతవరకు తెలీదే?!" అన్నాను ఆశ్చర్యంగా.

"నీకే కాదు- చాలామందికి ఈ విషయం తెలియదు. ఒక పిచ్చివాణ్ని తన అన్నగారని ఎవరు మాత్రం చెప్పుకుంటారు?" అన్నాడు తల్పశాయి.

నేనేమీ మాట్లాడలేదు.

తల్పశాయి తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు-

"అతను నా స్వంత అన్నగారు. కాలేజీలో చదువుకుంటుండగా అతనికి పిచ్చి ఎక్కింది. ఎందుకెక్కిందో తెలీదు. ఎన్నో వైద్యాలు చేయించాం. కాని, తగ్గలేదు. తర్వాత ఉన్నట్లుండి ఒకరోజున ఎక్కడికో వెళ్లిపోయాడు. ఎంత వెతికినా కనిపించలేదు. పేపర్లలో కూడా ఫొటో వేయించాం. కాని, కనిపించలేదు. కొన్ని నెలలు చూసి ఇంక అతను కనిపిస్తాడనే ఆశ కూడా వదులుకున్నాం. తర్వాత నాకు పెళ్ళి అవడం, ఉద్యోగం రావడం, మా అమ్మానాన్నా పోవడం- ఇవన్నీ కొన్ని ఏళ్లలో జరిగిన సంఘటనలు.

నాకు ఈ ఊరు బదిలీ అయ్యాక అనుకోకుండా ఒకరోజున మా అన్న ఈ ఊళ్లో కనిపించాడు. నేను పలకరించినా అతను నన్ను గుర్తుపట్టలేదు. అన్న మీద అభిమానం వదులుకోలేక అతన్ని ఇంటికి తీసుకువెళ్లాలనుకున్నాను. కాని, అందుకు మా ఆవిడ ససేమిరా ఒప్పుకోలేదు. నిజమే... సంసారంలో ఉన్న చిక్కులతోనే సతమతమయ్యేటప్పుడు ఈ పిచ్చివాడిని కూడా ఎవరు నెత్తిన పెట్టుకుంటారు? అయినా... అతను నాకు అన్న కాని, ఆమెకి కాదు కదా!

అక్కడికీ అభిమానం చంపుకోలేక అప్పుడప్పుడు అన్నం తీసుకెళ్లి అతను కూర్చుంటుండే అరుగు మీద పెట్టి తినిపించేవాడిని. ఇది చూసిన జనం ఆ పిచ్చివాడిలో ఏదో మహత్యం ఉందనీ, అందుకే నేను సేవలు చేస్తున్నాననీ భావించి ఆనోటా-ఈనోటా చెప్పుకోసాగారు.

దాంతో ఈ పిచ్చివాడికి లేని మహాత్యం వచ్చింది. అప్పుడు నాకు అనిపించింది- ఈ ప్రజల అమాయకత్వాన్ని, మూర్ఖత్వాన్ని ఆసరా చేసుకుని లాభం పొందవచ్చని! వెంటనే నేను కూడా అతని మహత్యం గురించి బాగా ప్రచారం చేశాను. దీనిమూలంగా పళ్లూ, ఫలహారాలూ, డబ్బూ రావడం మొదలెట్టాయి. పిచ్చివాడికి కొంత పెట్టినా మిగిలినది దేవుడి పేరుతో పూజారికి దక్కినట్లు మాకు రాసాగింది.

ఆ తర్వాతి సంగతి నీకు తెలిసిందే! కాని, ఆప్తమిత్రుడివి- నీవు కూడా ఈ మూర్ఖత్వంలో పడడం ఇష్టంలేక నిజం చెప్పేస్తున్నా. వాడి చేతలకు ప్రజలే అర్థం చెప్పుకుంటున్నారు కాని, నిజానికి మా అన్న దగ్గర ఏ మహాత్యమూ లేదు. మందులు వేసుకున్నా, వేసుకోకపోయినా రోగాలు కొన్ని తగ్గుతాయి. మందు పనిచేస్తే 'వైద్యుని ప్రజ్ఞ' అనుకుంటున్నాం. పనిచేయకపోతే 'మన ఖర్మ' అనుకుంటున్నాం. అలాగే కార్యం ఫలించినవాళ్ళు మా అన్న మహాత్యం అనుకుంటే- ఫలించనివాళ్ళు మిన్నకుండా ఊరుకుంటున్నారు. ప్రజలు గొర్రెలమంద కాబట్టి గుడ్డిగా నమ్మేస్తున్నారు" అన్నాడు తల్పశాయి.

అంతావిని నేను కొయ్యబారిపోయాను. సామాన్య ప్రజలు మూర్ఖులు, అమాయకులు అని తెలిసిన నేను కూడా మూర్ఖత్వంలో పడిపోయినందుకు సిగ్గుపడ్డాను.


"అయితే... ఇలా ఎన్నాళ్లు జరుగుతుంది?" అన్నాను.

"జరిగినన్నాళ్లు జరుగుతుంది. వచ్చిన మహాత్యం వచ్చినట్లే పోతుంది కొన్నాళ్లకి. ఆ తర్వాత మా అన్న మళ్లీ పిచ్చివాడుగానే ఉండిపోతాడు" అన్నాడు తల్పశాయి భారంగా నిట్టూరుస్తూ.

నన్ను చూసి నేనే జాలిపడుతూ, ఏడవలేక నవ్వుకుంటూ తల్పశాయి దగ్గర శలవు తీసుకుని ఇంటిముఖం పట్టాను.

అయితే... 'నిజమైన పిచ్చివాళ్ళు ఎవరు?' అన్న ప్రశ్నకి సమాధానం వెతుక్కుంటే ఏమీ చెప్పలేకపోతున్నాను.

*- ఆనంద జ్యోతి... 1 మార్చి '80*



**మరి.., నా సంగతి?**

డాక్టర్ : ఏమిటి... మీ కంప్లయింట్?

పేషెంట్ : నా భవిష్యత్తు గురించి చాలా దిగులుగా ఉందండీ!

డాక్టర్ : పర్వాలేదు. మీకు సంవత్సరంపాటు మంచి ట్రీట్‌మెంట్ ఇస్తాను. నెలకి వెయ్యి రూపాయలే ఛార్జి చేస్తాను.

పేషెంట్ : దాంతో మీ భవిష్యత్ బాగుపడ్తుంది. మరి.., నా సంగతి?